క్లుప్తంగా

ఉద్యోగులకు సన్మానం



విశాఖ స్టీల్‌ప్లాంట్ విశ్రాంత జనరల్ మేనేజర్ బలరామ్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సీతారాముని పేటలో ఉద్యోగాలు సాధించిన పలువురిని గురజాడ గ్రామీణ గ్రంథాలయం ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. సీఆర్‌పీఎఫ్, అగ్నివీర్ వంటి కేంద్ర కొలువులు సాధించిన యువకులతో పాటు విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో డిప్యూటీ జీఎంగా విధులు నిర్వహించి, పదవీ విరమణ చేసిన పతివాడ బలరామ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రేగాన శ్రీనివాసరావు, కడలి ప్రకాశరావు, బోనుమహంతి ఆదినారాయణ, రాంబార్కి రామారావు, బూర్లె సత్యం, గొర్లి శ్రీనివాసరావు, నేతేటి సుగుణాకరరావు, రామారావు, గ్రామ యువత పాల్గొన్నారు.

ఇవేం రోడ్లు బాబోయ్..



రామతీర్థం బోడికొండకు వెళ్లే మార్గంలో సీసీ రహదారిపై మురుగునీరు



అర్ధంతరంగా నిలిచిపోయిన బొప్పడాం - జోగిరాజుపేట రహదారి పనులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వాన్నంగా మారాయి. నెల్లిమర్ల - రణస్థలం ప్రధాన రహదారి పూర్తిగా గతుకలమయం కావడంతో ఆ మార్గంలో ప్రయాణించే వారికి అవస్థలు తప్పడం లేదు. గత ప్రభుత్వంలో నెల్లిమర్ల - రణస్థలం ప్రధాన రహదారి విస్తరణ పనులు చురుగ్గా జరిగాయి. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వంలో విస్తరణ పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారాయి. ఫలితంగా కల్వర్టుల వద్ద భారీ గోతులు ఏర్పడడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. జిల్లాలో అతి పెద్ద పుణ్యక్షేత్రమైన రామతీర్థంలో రహదారి పరిస్థితి అధ్వానంగా మారడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రధాన రహదారి నుంచి బోడికొండకు వెళ్లే సీసీ రహదారిలో మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. అలాగే బొప్పడాం నుంచి జోగిరోజుపేటకు వెళ్లే రహదారి పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. శిథిల రహదారులపై ప్రయాణాలు సాగించేదెలా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

● సంక్రాంతి సంబరాలు..



భోగాపురం మండలంలోని పలు గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. సోమవారం భోగి పండగను ఉత్సాహంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని కమ్మ పేరంటాలు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు, యువకుల కోలాటం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సూరబత్తుల చిరంజీవి, వరుపుల సుధాకర్, తిరుమరెడ్డి మురళీ (మాస్టర్), మనోజ్, నాని, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

– భోగాపురం

భోగభాగ్యాల భోగి..



గంగిరెద్దుకు మొక్కుతున్న మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, చిన్నారి

సంక్రాంతి పండగ నేపథ్యంలో ప్రజలందరూ భోగి పండగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజాము రెండు గంటలకే ముహూర్తం ప్రకారం భోగిమంటలు వేశారు. చిన్నారులు, పెద్దలు స్నానాలాచరించి, కొత్త దుస్తులు ధరించి ఆవుపేడతో తయారు చేసిన పిడకలను మంటలు వేశారు. భోగి పీడ సోకకూడదనే ఉద్దేశంతో తల్లిదండ్రులు తమ చిన్నారులకు భోగిపళ్లు పోశారు. చిన్నా,పెద్దా అనే తేడాలేకుండా ప్రతి ఒక్కరూ భోగి మంటల వద్దకు చేరుకుని సందడి చేశారు.

– పూసపాటిరేగ/విజయనగరం రూరల్/ సాక్షి ఫొటోగ్రాఫర్



మూడు కోవెళ్ల వద్ద ఎగసి పడుతున్న భోగి మంట



నెల్లిమర్ల రూరల్: వల్లూరులో భోగి మంట వద్ద స్థానికుల సందడి



పూసపాటిరేగ : బూడివీధిలో భోగిమంట



విజయనగరం రూరల్: దుప్పాడ గ్రామంలోని శ్రీక్షేత్రం వద్ద భోగీ సందడి



వసంత విహార్‌లో భోగి మంట వద్ద చిన్నారుల కోలాహలం



కోట వద్ద హరిదాసుకు బియ్యం వేస్తున్న చిన్నారి

నేర నియంత్రణకు డ్రోన్స్‌తో పర్యవేక్షణ

● వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్

విజయనగరం క్రైమ్: సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని నేరాల నియంత్రణకు డ్రోన్స్‌తో పర్యవేక్షిస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎస్. శ్రీనివాస్ అన్నారు. ఎస్పీ వకుల్‌జిందల్ ఆదేశాల మేరకు సోమవారం పట్టణంలో విజిబుల్ పోలీసింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రద్దీ ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేసేందుకు, నేరాలను నియంత్రించేందుకు డ్రోన్స్ వినియోగిస్తున్నట్లు చెప్పారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెట్టేందుకే డ్రోన్స్ ఉపయోగపడతాయన్నారు. బహిరంగ ప్రదేశాల్లో అసాంఘిక కార్యక్రమాలు చేపట్టేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వివిధ ప్రాంతాల్లో ఎస్సైలు నరేష్, సురేంద్రనాయుడు, ప్రసన్న కుమార్, తదితరులు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు.

యువత క్రీడల్లో రాణించాలి

● జెడ్పీటీసీ సభ్యుడు సన్యాసినాయుడు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు

నెల్లిమర్ల రూరల్: యువత క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు పిలుపునిచ్చారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని కొండవెలగాడలో సోమవారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నీలో స్థానిక రెడ్డిక వీధికి చెందిన క్రికెట్ జట్టు విజయాన్ని సాధించింది. 110 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన రెడ్డికి వీధి జట్టు కేవలం ఎనిమిది ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి టోర్నీలో విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడల్లో ఇప్పటికే కొండవెలగాడకు సముచిత స్థానం ఉందన్నారు. క్రీడల్లో రాణిస్తూ యువత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భోగి మంటలో విద్యుత్ బిల్లులు



భోగి మంటలో విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న నాయకులు

నెల్లిమర్ల: విద్యుత్ చార్జీలు పెంచడాన్ని నిరసిస్తూ మండలంలోని జరజాపుపేటలో పలువురు వినియోగదారులు సీపీఎం నాయకుడు కిల్లంపల్లి రామారావు ఆధ్వర్యంలో సోమవారం భోగి మంటలో విద్యుత్ బిల్లులు వేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ట్రూఅప్ చార్జీల పేరిట విద్యుత్ ఛార్జీలు పెంచడం తగదన్నారు. వినియోగిస్తున్న విద్యుత్ కంటే ఇతర చార్జీలే ఎక్కువగా ఉన్నాయని మండిపడ్డారు. వెంటనే విద్యుత్ చార్జీలను తగ్గించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కనకల పద్మనాభం, కనకల రాము, మద్దిల ప్రకాష్, గురువులు, మాత వెంకటరమణ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

వేపాడ: సంక్రాంతి, తీర్థమహోత్సవాల నేపథ్యంలో గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని వల్లంపూడి ఎస్‌ఐ బి. దేవి హెచ్చరించారు. బల్లంకి, బానాది, కృష్ణారాయుడుపేట గ్రామాల్లో సోమవారం ఆమె పర్యటించారు. ఆయా గ్రామాల పెద్దలు, ప్రజలతో సమావేశమయ్యారు. సంక్రాంతి పండగతో పాటు పండగ అనంతరం నిర్వహించే తీర్థమహోత్సవాల్లో పేకాట, బల్లాటలు, కోడి పందేలు, అశ్లీల నృత్యాల ప్రదర్శనలు ఏర్పాటు చేసినా, ప్రోత్సహించినా, అలాగే బెల్టు దుకాణాలు నడిపినా కేసులు నమోదు చేస్తామని చెప్పారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారిపేర్లు గోప్యంగా ఉంచుతామని, శాంతిభద్రతల పరిరక్షణకు అంతా సహకరించాలని కోరారు.

వెల్లివిరిసిన మానవత్వం..

సంక్రాంతి పండగ నేపథ్యంలో వాడవాడలా సేవా కార్యక్రమాలు చేపట్టారు. భోగీ సందర్భంగా సోమవారం పలు ప్రాంతాల్లో వివిధ రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించి, దాతలు తమ మానవత్వాన్ని చాటుకున్నారు. పేదలకు దుస్తులు, నిత్యావసర సరుకులు అందజేసి, అండగా ఉంటామని భరోసా కల్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



భోగాపురం: పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు పడాల రాజేశ్వరి, శ్రీనివాసరావు దంపతులు



డెంకాడ: పినతాడివాడలో నిత్యావసర సరుకులను అందిస్తున్న ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొర్నాన ఆదయ్య



పూసపాటిరేగ: కందివలసలో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ దేశెట్టి గణేష్, తదితరులు



విజయనగరం టౌన్: నిరుపేదలకు నిత్యవసరాలను అందజేస్తున్న సుధారాణి మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధులు ఎంపీజీ ఈశ్వరరావు, తదితరులు



విజయనగరం టౌన్: గాజులరేగ సాలివీధిలో చీరలు పంపిణీ చేస్తున్న లెంక రమణ, పద్మ